# వెన్నెలలో

---

తెల్లటిచీర కట్టుకొన్నది. తల దువ్వుకొని అర్ధచంద్రాకారంగా మల్లెపూలు పెట్టుకొని, నాటి మధ్య గులాబీలు అమర్చింది. పచ్చని మెడలో జారిపోతులాగ బంగారపు గొలుసొకటి మెరుస్తూంది పిల్లలను నిద్రపుచ్చి వచ్చింది నా దగ్గరకు. నేను పండువెన్నెలలో మంచంమీద పరుపు వేసుకొని, పైన తెల్లదుప్పటి పర్చుకొని, తలవైపు దీపం పెట్టుకొని, పడుకొని చదువుకొంటున్నాను. వచ్చి,

"ఏమిటండీ చదువుతున్నారూ" అన్నది మందహాసం చేస్తూ. మాట్లాడలేదు.

"మాట్లాడరా, మీలో మీరే నవ్వుకోవాలేం ? చెప్పండి అదేమిటో" అన్నది దీపం తగ్గిస్తూ.

"చెప్పమంటావా ?"

"మరేమిటి నేననటమూ ?"

"పద్మములతో సమానమైన ముఖము గల సుందరీ—

అంటూంటే మా ఆవిడ మాటకు అడ్డం వచ్చి "అదేమిటి ఆవికారం మళ్ళీనూ" అన్నది.

ఇదివరలో ఇల్లాంటి వికారాలు నాకు తరుచూ రావటం. మా ఆవిడ చికిత్స చేయటం చాలా సార్లు జరిగినాయి. అందు

కని అల్లాగ అన్నది. "ఏమి వికారం కనపడ్డది అప్పుడే నీకు" అన్నాను నేను.

"ఆమాట లేమిటీ ? పద్మములతో సమానమైన ముఖము గలదానా అని అనటం ఎందుకూ నవ్వు వచ్చి రావటంలోనే —ఇవీ ఆవిడ మాటలు.

నిన్నేమన్నానూ ? ఇవి నా మాటలు

"మరి ఎవరినన్నా రేమిటి ? నేను ఇంకా నన్నే అన్నానను కొంటున్నా, ఇంకా ఎవరినైనా కూడా... ఇల్లాంటి మాటలు అంటూ ఉన్నారా ఏమిటీ ! ! లేకపోతే కలవరిస్తున్నావా ?" అన్నది మా కాంతం నాప్రక్కనే నన్ను ఆనుకొని కూర్చుని.

దానికేదన్నా జవాబు చెప్పాలెగదా నేను. చెప్పలేను. నవ్వానైనా నవ్వలేదు. ఊరికే అల్లాగ ఉండిపోయినాను. ప్రస్తరం లాగ పడుకొని ఊరుకొన్నాను. పలకలేదు ; ఉలకలేదు.

నేనంటే బుద్ధి చెప్పుకొని ఊరుకొన్నాను గాని ఆనోరులేని చేతులకు ఏం తెలుసు పాపం. తలక్రిందనున్న ఎడమచేయి పడగవిప్పిన పాములాగ లేచి ఆమె కటిస్థానాన్ని చుట్టివేసింది. ఇక అంతపని జరిగిన తరువాత ఊరుకోటం ఎందుకని నేనూ, ఒక వేలును నాభిస్థానానికి తాకించిచక్కిలిగింత పెట్టాను.

"నిన్ను అనటంకాదూ... ఇంకొకరిని అనటమూ కాదు. పుస్తకాల్లో మాటలు చదువు తున్నాను." అని అప్పటికి తెముల్చుకొని జవాబు చెప్పగలిగినాను. "అల్లాగా ! ఏమిటీ ? చదవండి, చదవండి. ఎవరు అంటూ ఉన్నారూ, ఏమిటి నంద

ర్థం ? చెప్పే కథ ఏమిటో - వింటానూ." అన్నది మా ఆవిడ వచ్చి, నా ముఖం మీద ముఖంపెట్టి, చెదరిన నా క్రాపును సవరిస్తూ.

"చెప్పటానికి పెద్ద కథ ఏమీ లేదు ఇందులో, ఇదొక వైద్యగ్రంధము, ఇందులో..."

"వైద్యగ్రంథమూ అంటే మందూ మాకూ"

"ఆ, అదే అదే. రోగాలూ, రోగలక్షణాలూ వాటిని చికిత్స చేయవలసిన విధం అంతంతా ఈ పుస్తకంలో వ్రాశాడు గ్రంథకర్త" అన్నాను.

ఈ మాటలు అంటూనే ఉన్నానూ, నాకుడిచెయ్యి పుస్తకాన్ని వదిలేసి, అమాంతంగా, దానంతట అదే వెళ్ళిపోయి ఆమె చెక్కిళ్ళమీద పడిపోయింది. అందులో నా ప్రయత్నం ఏమీ లేదు.

ఆవిడ నా చెయ్యి మెల్లగా, బహుజాగ్రత్తగా తీసింది. అదేదో నలిగిపోగల మెత్తని పువ్వులాగ తీసి, తన రొమ్ముపై నానించుకొని నా వేళ్ళసందుల్లోకి తన వేళ్లు పోనిచ్చి, విలాసంగా నొక్కుతూ మళ్ళీ అన్నదీ "అయితే చూడండీ. రోగాలసంగతి చదువుతుంటే నవ్వు ఎందుకు వచ్చిందండీ ?" అని.

"దానికి ఒకటీ... రెండూ... చూశావా రెండు కారణాలున్నాయి" అన్నాను, చెయ్యి, చిలిపిచేష్టలు చేస్తూ ఉండంగానే.

"ఆ రెండు కారణాలూ ఎట్లాంటివో నొక్కి వక్కాణించండి

నాన్నని కూడా ఆవిడ నవ్వుతూ, నా పుస్తకాల్లోకూడా చూసింది..

"అల్లాగే ఇంకేకాదు శాస్త్రోక్త విషయాలుండేవి? మొదటి విషయం, ఈ స్త్రీపురుష ధర్మశాస్త్రాల్లో ఉన్నాయి. వైద్య గ్రంథాన్ని అంతా తన ప్రియురాలికి చెప్పినట్టుగా వర్ణించాడు.

"అయితే మీకు నవ్వు ఎందుకూ?"

"నేను నా కథలన్నీ నీ పేరనే వ్రాస్తున్నట్టుగా ఉంచని నవ్వు వచ్చింది."

"అల్లాగ కాదు. మీరు వ్రాసే పుస్తకాలన్నీకూడా నాకు చెప్పినట్లుగా వ్రాయండి. "ఓ కాంతం - అశ్వని చక్రవర్తి మహమ్మదీయుడు అయ్యి — హిందువులమైన మిక్కిలి దయతో ప్రవర్తించడం చాలా గొప్ప విషయము సుమా! అని ఈ ధోరణిలో వ్రాయండి"

"సరేలే. అది అల్లాగుంచు. ఇక్కడ వ్రాస్తావూ, ఓ పద్మకలా, కటకరోహిణి కషాయము నోటి అనవ్యాపము పోగొట్టుటయున్నూ, తామర మొగ్గలవంటి కుచములు గల స్త్రీని ఆలింగనము చేసికొనుటవలన స్త్రీకి సంతోషము కలుగుటయున్నూ, అను నీరెండున్నూ నాకు ఆశ్చర్యముగా ఉన్నవి అని."

"ఇక ఈ విషయం ఈ పాటున కట్టిపెట్టి మీరు నవ్వటానికి ఆ రెండో కారణం ఏదో అది కొంచెం నొక్కకుండా వక్కాణించండి"

"రెండోది ఏముందిలే ... అది సామాన్యవిషయమే. ఆ పుస్తకంలో రోగాలను గురించి చదువుతూ ఉంటే ఆ రోగ లక్షణాలన్నీ నాకు ఉన్నట్లు తోస్తున్నది. సన్నిపాత లక్షణాలను గురించి చెపుతూ...శరీర మంతయు నొప్పుట మొదటి విషయమనూ అన్నాడు. ఇప్పుడు నాకు శరీరమంతా నొప్పులుగా ఉంది. "ఉరిమి చూచుట అన్నాడు తరువాత."

"అది మీకు అలవాటే ఆయెను. చీటికి మాటికి ఉరిమి చూస్తుంటారు. ఈ లక్షణం మట్టుకు మీకు తీవ్రంగా ఉన్నట్లు నేనే ఒప్పుకొంటాను" అన్నది.

"సరే నీవే ఒప్పుకొన్నావా ! ఇక మూడో లక్షణం కను బొమ్మలు ముడిపడుటా అనిఉంది."

"సరి సరి. ఇక చెప్పక్కర్లేదు. ఉరిమి చూట్టం కనుబొమలు ముడిపడటం మనకు సహజలక్షణాలేనాయె. తరువాత ?"

"తరువాత ఆడటం...పాడటం అన్నాడు."

"అవి ఇంకా పుట్టలే దనుకొంటా" అన్నది మా ఆవిడ.

"పుట్టకేం ? ఇపుడు పుట్టినాయి ఇపుడు లేచి ఆడి పాడుదామా అనిపిస్తున్నది."

"కాబట్టి ఏమంటారు ఇంతకూ ?"

"ఏమనేది, ఏమున్నదీ...చిత్తవిభ్రమ సన్నిపాతం నాకు పూర్తిగా కలిగింది."

"ఎబ్బే ? ఏంమాటలివీ ...."

"ఉన్నమాట అంటే నీకు అంత కష్టం ఎందుకూ ? కలిగిన

మాట నిజము—చిత్త...విభ్రమ...సన్నిపాతం — తెలిసిం దా ?" అని మాట విడదీసి ఉచ్చరించాను.

"మీాకా, చిత్త - విభ్రమ - సన్నిపాతమా ? అని పక పకా నవ్వుతూ, తన రెండు చేతులతో నాతలను తన మెత్తని ముఖానికి అద్దుకొంది."

పేరంటానికి వెళ్ళి వచ్చింది కాబోలు ఆరోజు. మెడకు మంచిపరిమళముగల గంధం పూశారు. అనువాసన, ఆతల నూనెకు సంబంధించిన పరిమళం నాకు మత్తెకించినై. నాకు కళ్లుమూతలు పడ్డాయి.

ఆమె పెదవులు నాబుగ్గలను వెచ్చగా తాకేటంతవరకు నాకు ఈ లోకమే తెలియదు.

నిజంగా నేనుఆరోజున ఏదో స్వర్గసౌఖ్యాన్ని అనుభవిం చాను. నేను కవినిగాదు. భాషరాదు. ఆసౌఖ్యాన్ని వర్ణిం చలేను, కాని అనుభవించాను. ఈజన్మకు ఆఖరుసారి అను భవించాను. ఆసౌఖ్యముయొక్క లోతూ రంగూ, ఆనంద మూఅనుభవించిన వాళ్ళకే తెలియాలె.

కాని ఆ ఆనందం ఇల్లాంటిదీ అని చెప్పటానికి నోరు లేదే అని ఏడుపొస్తున్నది. చెప్పలేక పోసేంది. కాని నేను ఆనందాన్ని పొందినమాట నిజమేగా ! ! అనుభవించాను. అనుభవించాను. అనుభవించాను. ఈజన్మలో ఇక అనుభవిం చను. ఆరోజున నిజంగా చిత్తవిభ్రమ సన్నిపాతం కలిగింది. కలిగింది చిత్తవిభ్రమ సన్నిపాతం. అందుకని అన్నానూ ఆవిడ

తో అప్పుడూ, " నిజంగా కాంతం! నాకు ఆజబ్బు వచ్చేట్టేదీ" అన్నాను.

"వాల్లే... ఊరుకోండీ—పోనీ అయినా ఆ జబ్బుకు చికిత్స ఏమిటో చెప్పండీ చూద్దాము" అన్నది.

" ఈ రోగాలకూ—కషాయాలు పనికి రావట !

"ఊఁ"

"లేహ్యాలు అసలే పనికిరావట !"

"మరి ఏమన్నాడండీ———" అన్నది తన చేతితో నాచేతిని నొక్కుతూ.

"శ్లోకం విను"

"అర్థం చెప్పాదురూ. ఇప్పుడు శ్లోకాలువినటానికి ఓపికెక్కడఉంది! నిద్రవస్తున్నది." అని పక్కపైన ఒరిగి పండుకొని ఆవలించి రెండుచిటికలు వేసింది. మెళ్ళో గొలును పక్కకు జారి తళుక్కుమన్నది వెన్నెల్లో. ఆ తెల్లని వెన్నెల్లో ఆమె బుగ్గలు నీటి బుడగలలాగ మెరసినవి. ఆ ముఖచంద్రుడి దగ్గర ఆర్ద్రానక్షత్రంలాగ ఆ క్రిందిపెదవి ఎర్రగాఉంది. మల్లెపూలు జారి కొన్ని పక్కమీదపడ్డాయి.

దృఢమాలింగనం పథ్యం
క్వాథశ్చాధరచుంబనమ్—

"వింటున్నావా— ప్రియురాలియొక్క అధర చుంబనమే కషాయమట......ఆమె గాఢాలింగనమే పథ్యమట. ఆఁ వింటున్నావా ? కాబట్టి..."

"ఊఁ శాస్త్రీ—. ఊఁ శాస్త్రీ— చెప్పండేమిటో"

"శాస్త్రీ ఇప్పుడేంచేయాలో తెలుసునా నా ఉద్యోగం వయ్యంగారాలంటే!"

"ఊఁ ఏం చెయ్యాలా?...అ......

"అబ్బా!" "ఊరుకోండి"

పుస్తకం, ఇక నామొక్క ఉండటానికి ఇష్టంలేక తకిపలని కింద పడిపోయింది.

---